ప్రభాత
# ఉదయం
తెలుగు దినపత్రిక

## రిపోర్టర్లు కావలెను

అత్యంత ప్రజాదరణ పొందిన ప్రభాత ఉదయం
తెలుగు దినపత్రికలో పనిచేయుటకు తెలంగాణ వ్యాప్తంగా
జిల్లా, మండల మరియు నియోజకవర్గాల వారీగా
రిపోర్టర్లు కావలెను.

ప్రభాత ఉదయం తెలుగు దినపత్రిక

సంప్రదించండి
ఫోన్: 93910 89608

సంపుటి: 3 | సంచిక: 338 | పేజీలు: 6 | వెల: రూ.3/- | బుధవారం 18 మార్చి 2026 | ఎడిటర్: ఎం.దామోదర్ రెడ్డి

# తెలంగాణ అసెంబ్లీలో మాటల యుద్ధం

సిక్స్ ప్యాక్ ఫైల్ ఎక్కడ పోయింది

సిఎం సంతకానికే దిక్కలేకపోతే ఎలా

గత గవర్నర్ ప్రసంగాలకు..నేటికి ఏం తేడా

గవర్నర్ ప్రసంగంలోనే తప్పులు దొర్లితే ఎలా

ఢిల్లీకి వెళ్లి నిధులు తేకుండా..నిధులు ఇచ్చి వస్తున్నారు

420 వరల్డ్ కప్ పెడితే కాంగ్రెస్ ఫస్ట్ వస్తుంది

కాంగ్రెస్ గ్యారెంటీలకు..ప్రభుత్వానికి జీరో వాల్యూ

ధన్యవాద తీర్మానంపై ఎందుకు ధన్యవాదాలు తెలపాలి

తెలంగాణ అసెంబ్లీలో గవర్నర్ ప్రసంగంపై కెటిఆర్ విసుర్లు



హైదరాబాద్, మార్చి 17 (ప్రభాత ఉదయం)

తెలంగాణ అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు కొనసాగుతున్నాయి. శాసనసభలో గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై చర్చ జరిగింది. ఈ సందర్భంగా అధికార, ప్రతిపక్ష నేతల మధ్య మాటల యుద్ధం నడిచింది. రాష్ట్ర ప్రభుత్వంపై మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే కేటీఆర్ విమర్శలు గుప్పించారు. 'పెన్షన్ పెంచనందుకు ధన్యవాదాలు చెప్పాలా? నిరుద్యోగ భృతి ఇవ్వనందుకు ధన్యవాదాలు చెప్పాలా.. ఉద్యోగులను మోసం చేసినందుకు ధన్యవాదాలు చెప్పాలా. ఎందుకు ఈ ప్రభుత్వానికి ధన్యవాదాలు చెప్పాలి' అని కేటీఆర్ ప్రశ్నించారు. కేటీఆర్ వ్యాఖ్యలకు మంత్రులు కూడా స్ట్రాంగ్ కౌంటర్ ఇచ్చారు.

**కేటీఆర్‌కు కోమటిరెడ్డి కౌంటర్**

కేటీఆర్ వ్యాఖ్యలకు మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి కౌంటర్ ఇచ్చారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి ధన్యవాదాలు చెప్పాలని అన్నారు. 'రేషన్ కార్డు ఇచ్చినందుకు ధన్యవాదాలు చెప్పాలి. యంగ్ ఇండియా స్కూల్ కట్టినందుకు, ఆర్టీసీలో మహిళలకు ఉచిత బస్సు ఇచ్చినందుకు, ఇందిరమ్మ ఇండ్లు ఇచ్చినందుకు ధన్యవాదాలు చెప్పాలి' అని అన్నారు. కేటీఆర్ ఓపికగా ఉండాలని మంత్రి హితవుపలికారు. ఈ ప్రభుత్వం పేదల కోసమే ఉందని స్పష్టం చేశారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం లక్షల కోట్లు అప్పు చేసిందని.. వాటికి తాము వడ్డీ కడుతున్నామని.. అందుకు ధన్యవాదాలు చెప్పాలంటూ కేటీఆర్‌కు మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి ధీటైన జవాబిచ్చారు.

**కేటీఆర్‌పై డిప్యూటీ సీఎం ఫైర్**

గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాలు చెప్పకుండా ప్రభుత్వాన్ని కేటీఆర్ విమర్శిస్తున్నారని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మండిపడ్డారు. 53 లక్షల

..మిగతా 2లో



## డ్రగ్ టెస్టుకు సీఎం రేవంత్ రెడ్డిని తీసుకువస్తా

### కెసిఆర్‌ను మీరు తీసుకు రావాలి

మండలిలో మహేశ్ గౌడ్ ఆవేశపూరిత ప్రసంగం

హైదరాబాద్, మార్చి 17 (ప్రభాత ఉదయం)

అందరికీ డ్రగ్స్ టెస్ట్ చేద్దాం..అందుకు మీరు సిద్ధమేనా అంటూ శాసన మండలిలో కాంగ్రెస్ ఎమ్మెల్సీ, తెలంగాణ పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ సవాల్ చేశారు. మొయినాబాద్ ఫామ్ హౌజ్ డ్రగ్స్ కేసు సిగ్గు చేటని, బిఆర్ఎస్ నేతలు సిగ్గు పడాలని కీలక వ్యాఖ్యలు చేశారు. రాష్ట్రంలో డ్రగ్స్ సమస్యపై తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తూ.. గత పదేళ్లలో గంజాయి, కొకైన్ వంటి మత్తు పదార్థాలు విస్తృతంగా వ్యాపించాయని పేర్కొన్నారు. డ్రగ్స్ నిర్మూలనకు కఠిన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉ ందన్నారు. ప్రజాప్రతినిధులందరూ డ్రగ్స్ టెస్టులు చేయించుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. తాను డ్రగ్ టెస్టుకు సీఎం రేవంత్ రెడ్డిని తీసుకువస్తానని, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సిద్ధమా? అని మహేష్ గౌడ్ సవాల్ విసిరారు. 'మీరు మీ నాయకుడిని డ్రగ్స్ టెస్టుకు తీసుకురండి. నేను మా సీఎం రేవంత్ రెడ్డిని తీసుకువస్తాను' అంటూ మహేష్ కుమార్ గౌడ్ సవాల్ విసిరారు. రాష్ట్రంలో గత రెండేళ్లుగా డ్రగ్స్ నియంత్రణకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు. ఇటీవల డ్రగ్స్ కేసులో బీఆర్ఎస్‌కు చెందిన ఒక నాయకుడు పట్టుబడిన విషయాన్ని ప్రస్తావిస్తూ.. ఆ పార్టీ అతనిపై ఎలాంటి చర్యలు తీసుకుందో ప్రశ్నించారు. ప్రజలకు, ముఖ్యంగా యువతకు సరైన సందేశం ఇవ్వాల్సిన బాధ్యత నాయకులపై ఉందని అన్నారు. డ్రగ్స్ సమస్యపై

..మిగతా 2లో



## ఢిల్లీకి సిఎం రేవంత్

### ఖర్గేతో భేటీ

న్యూఢిల్లీ, మార్చి 17 (ప్రభాత ఉదయం)

తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఢిల్లీకి చేరుకున్నారు. నేరుగా ఎఐసీసీ నూతన కార్యాలయం 'ఇందిరా భవన్'లో జనరల్ సెక్రటరీ కేసి వేణుగోపాల్‌తో భేటీ అయ్యారు. ఈ సమావేశంలో పిసిసి చీఫ్ మహేష్ కుమార్ గౌడ్, వేం నరేందర్ రెడ్డి కూడా పాల్గొన్నారు. భేటీలో తెలంగాణ తాజా రాజకీయ పరిణామాలపై చర్చించినట్లు సమాచారం. ఇకపోతే తాజా రాజకీయాలతో పాటు, వివిధ రాష్ట్రాల్లో ఎన్నికలపైనా చర్చించారని తెలుస్తోంది. తెలంగాణ నుంచి కూడా పలువురు నేతలు ప్రచారంలో పాల్గొనబోతున్నారు. ఇందులో సిఎం రేవంత్ కూడా ఉన్నారు. ఈ క్రమంలోనే కాంగ్రెస్ రాజ్యసభ సభ్యుడిగా అవకాశం కల్పించినందుకు కేసి వేణుగోపాల్‌కి వేం నరేందర్ రెడ్డి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

## లోక్‌భవన్‌లో ఉగాది ఉత్సవాలు

### జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించిన గవర్నర్



హైదరాబాద్, మార్చి 17 (ప్రభాత ఉదయం)

తెలంగాణ లోక్‌భవన్‌లో ఉగాది ఉత్సవాలు నిర్వహించారు. గవర్నర్ శుక్లా ముఖ్య అతిథిగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేశారు. ఆహుతులను స్వయంగా స్వాగతించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ..ఇక్కడికి విచ్చేసిన విశిష్ట అతిథులకు, ఆహ్వానితులకు, లోక్ భవాని పరివార్ సభ్యులకు మరియు కళాకారులకు పేరు పేరున నాహృదయపూర్వక నమస్కారములు అని అన్నారు. మీ అందరికీ శ్రీ 'పరాభవ' నామసంవత్సర ఉగాది పండుగ శుభాకాంక్షలు అని తెలిపారు. ఈ నూతన సంవత్సరం మీ కుటుంబాల్లో ధన, ఆరోగ్య, సంతోషాలను నింపాలని కోరుకుంటున్నట్లు వెల్లడించారు. అరవై ఏళ్ల కాలచక్రంలో 'పరాభవ' 40 వ సంవత్సరం..

..మిగతా 2లో

## కాబూల్ ఆస్పత్రిపై పాక్ వైమానిక దాడి

కాబూల్ ఆస్పత్రిపై పాక్ వైమానిక దాడి

దాడిలో 400 మంది మృత్యువాత

మంటల్లో చిక్కుకున్న ఆస్పత్రి భవనం

దాడి ఘటనను తోసిపుచ్చి పాక్ ప్రభుత్వం



కాబూల్,మార్చి17 (ప్రభాత ఉదయం)

అఫ్ఘానిస్థాన్‌లో పెను విషాదం చోటుచేసుకుంది. పాకిస్థాన్ జరిపిన వైమానిక దాడిలో 400 మంది ప్రాణాలు కోల్పోగా.. 200 మందికి పైగా తీవ్రంగా గాయపడ్డారు. కాబుల్‌లోని ఓ ఆస్పత్రిపై పాకిస్థాన్ వైమానిక దాడి చేసిందని.. ఈ దాడిలో 400 మంది ప్రాణాలు కోల్పోయారని తాలిబన్లు ప్రకటించారు. ఈ దాడిలో ఆస్పత్రి పూర్తిగా ధ్వంసమైందని.. మృతుల సంఖ్య మరింత

..మిగతా 2లో



## హ్యామ్ రోడ్ల పేరుతో 18వేల కోట్ల కుంభకోణం

కమిషన్ల కోసం 10 శాతం మొబిలైజేషన్ చెల్లింపు

కాంగ్రెస్ ఎన్నికల ఖర్చు కోసం రేవంత్ సన్నాహాలు

మాజీమంత్రి, బిఆర్ఎస్ నేత హరీష్ రావు ఆరోపణలు

హైదరాబాద్, మార్చి 17 (ప్రభాత ఉదయం)

తెలంగాణ రాష్ట్ర రాజకీయాల్లో మరోసారి సంచలన ఆరోపణలు వెలువడ్డాయి. అసెంబ్లీలో జరిగిన చిట్‌చాట్ సందర్భంగా మాజీ మంత్రి హరీష్ రావు రాష్ట్రంలో భారీ కుంభకోణం జరుగుతోందని ఆరోపించారు. హ్యామ్ రోడ్ల పేరిట సుమారు రూ.18 వేల కోట్ల స్కాం జరుగుతోందని తీవ్ర వ్యాఖ్యలు చేశారు. ఆనాడు మొబిలైజేషన్ అడ్వాన్స్‌లు ఇస్తే రేవంత్ రెడ్డి వద్దు అని గొడవ పెట్టారని.. ఇప్పుడు 10 శాతం మొబిలైజేషన్ ఇస్తున్నారని హరీష్ రావు మండిపడ్డారు. ఈ రకంగా రాష్ట్రంలో అతిపెద్ద కుంభకోణం

..మిగతా 2లో



## ఇఫ్తార్ వేడుకలు సామరస్యానికి నిదర్శనం

జర్నలిస్టుల సంక్షేమానికి కట్టుబడి ఉన్నాం

మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి

2లో..

# తెలంగాణ అసెంబ్లీలో మాటల యుద్ధం

మొదటి పేజీ తరువాయి...

కుటుంబాలకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్ ఇస్తున్నామని చెప్పారు. కోటి ఆరు లక్షల కుటుంబాలకు సన్నబియ్యం ఇస్తున్నామని వివరించారు. బీఆర్ఎస్ ప్రభుత్వంలో డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు అందరికీ ఇస్తామన్నారు.. ఇచ్చారా అని ఉపముఖ్యమంత్రి ప్రశ్నించారు. రూ.22,500 కోట్లతో ఒక్కో నియోజకవర్గంలో 3,500 ఇందిరమ్మ ఇండ్లు కట్టిస్తున్నామని ఉపముఖ్యమంత్రి వెల్లడించారు.

రైతు భరోసా కింద తొమ్మిది రోజుల్లో తొమ్మిది వేల కోట్ల రూపాయలను రైతుల ఖాతాల్లో వేశామని డిప్యూటీ సీఎం తెలిపారు. సన్న వడ్లకు క్వింటాలుకు రూ.500 బోనస్ ఇస్తున్నామన్నారు. 'మీలా మేము ఇంటికో ఉద్యోగం ఇస్తామని ఇవ్వకుండా వదల్లేదు. మూడు ఎకరాలు ఇస్తామని ఇవ్వకుండా వదిలేయలేదు. దళితుడిని ముఖ్యమంత్రిని చేస్తామని మోసం చేయలేదు. మీరు తెచ్చిన అప్పులకు అసలు, వడ్డీలు కడుతూనే ఈ పనులన్నీ చేస్తున్నాం' అంటూ డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క పేర్కొన్నారు.

**ఎగ్గొట్టు, కూలగొట్టు, చెడగొట్టు అన్నట్టుగా పాలన: కేటీఆర్**

సీఎం తొలి సంతకం పెట్టిన ఫైలుకే దిక్కులేదని, ఇంకా ఈ ప్రభుత్వం మాటలు ఎవరు నమ్ముతారని కేటీఆర్



విమర్శించారు. 'మహాలక్ష్మి పథకం కింద ప్రతి కుటుంబానికి రెండున్నర లక్షలు ఇస్తామన్నారు.. ఇచ్చారా' అని ప్రశ్నించారు. ఈ రెండున్నర సంవత్సరాలు ప్రజలకు పరిహాస నామ సంవత్సరంగానే మిగిలిందని ఎద్దేవా చేశారు. ఎగ్గొట్టు, కూలగొట్టు, చెడగొట్టు అన్నట్లుగా రెండేళ్ల పాలన సాగిందన్నారు. ప్రజా పాలనలో ప్రజలు కోటీ 85 లక్షల దరఖాస్తులు పెట్టుకున్నారని.. ఎక్కడికి పోయాయి ఆ దరఖాస్తులు అని ప్రశ్నిస్తూ.. గల్లంతయ్యాయా అంటూ కేటీఆర్ నిలదీశారు. టీ 20 మాదిరిగా 420 పోటీలు పెడితే ఈ ప్రభుత్వమే గెలుస్తుందంటూ మాజీ మంత్రి సెటైర్ విసిరారు. సీఎం తీరు ఎన్నికల ముందు దానకర్ణ.. ఆ తర్వాత కుంభకర్ణలా మారిందన్నారు. అట్టర్ ఫ్లాప్ ప్రభుత్వం సంబరాలు చేసుకుంటోందని కేటీఆర్ వ్యాఖ్యలు చేశారు.

**కేటీఆర్‌ది ఊకదంపుడు ఉపన్యాసం: మంత్రి శ్రీధర్ బాబు**

ప్రభుత్వానికి కేటీఆర్ సలహాలు, సూచనలు ఇస్తారని అనుకున్నామని.. ఎవరో రాసిన స్క్రిప్ట్‌ను చదువుతున్నారని మంత్రి శ్రీధర్ బాబు అన్నారు. ఊకదంపుడు ఉపన్యాసం ఇస్తున్నారంటూ విమర్శించారు. ప్రధానమంత్రి దగ్గరకు కేటీఆర్ ఎన్నిసార్లు వెళ్లారో లెక్క తీయాలన్నారు. రాష్ట్ర ప్రయోజనాల కోసం ఎన్నిసార్లైనా ఢిల్లీకి వెళతామని.. ప్రధానిని మంత్రులను కలుస్తామని మంత్రి స్పష్టం చేశారు. ప్రభుత్వాన్ని కాపాడుకోవడానికి బీఆర్ఎస్‌లా తాము ఢిల్లీకి వెళ్లడం లేదని అన్నారు. కేటీఆర్ సత్యదూరమైన మాటలు మాట్లాడుతున్నారన్నారు. 2023 అసెంబ్లీ ఎన్నికల్లో, పార్లమెంట్ ఎన్నికల్లో, మున్సిపల్ ఎన్నికల్లో ఫ్లాప్ అయింది బీఆర్ఎస్ అంటూ మంత్రి శ్రీధర్ బాబు అన్నారు.

**ఢిల్లీకి వెళ్తే నిధుల తెస్తారనుకున్నాం: కేటీఆర్**

మంత్రి వ్యాఖ్యలపై కేటీఆర్ స్పందిస్తూ.. 'మీరు ఎన్నిసార్లు ఢిల్లీకి వెళ్లినా మాకు అభ్యంతరం లేదు. మీరు ఢిల్లీకి పోతే నిధులు తెస్తారని అనుకున్నాం. కానీ మీరు ఢిల్లీకి వెళ్లి నిధులు ఇచ్చేసి వస్తున్నారు. రూ.3.60 లక్షల కోట్ల ఐటీ ఎక్స్‌పోర్ట్స్ అని మంత్రి బయట చెప్పారు. కానీ గవర్నర్ ప్రసంగంలో రూ.7 వేల కోట్లు తగ్గాయని చెప్పారు' అంటూ మాజీ మంత్రి కేటీఆర్ పేర్కొన్నారు.



# డ్రగ్ టెస్టుకు సీఎం రేవంత్ రెడ్డిని తీసుకువస్తా

మొదటి పేజీ తరువాయి...

శ్వేతపత్రం విడుదల చేయాలని కూడా కోరారు. డ్రగ్స్ కేసుల్లో ఎంత పెద్దవారైనా వదిలే ప్రసక్తే లేదని మహేష్ కుమార్ గౌడ్ స్పష్టం చేశారు. రాజకీయ పార్టీలకు చెందిన అభ్యర్థులకు బీ-ఫారమ్ ఇచ్చే ముందు డ్రగ్స్ టెస్టులు చేయాలని సూచించారు. కొందరు నాయకులు డ్రగ్స్ వ్యాపారంలో నేరుగా పాల్గొంటున్నారనే ఆరోపణలు కూడా చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పటికే ఐదు గ్యారంటీలను అమలు చేసిందని తెలిపారు. గాంధీ విగ్రహం అంశంపై ప్రతిపక్షాలు రాజకీయాలు చేస్తున్నాయని విమర్శించారు. మూసీ నది పరిస్థితిపై కూడా స్పందిస్తూ.. అభివృద్ధి లేకపోతే పెట్టుబడులు ఎలా వస్తాయని ప్రశ్నించారు. రాష్ట్రానికి, దేశానికి సేవ చేసిన మహనీయుల విగ్రహాలను ఏర్పాటు చేయాలని పిలుపునిచ్చారు. సోషల్ మీడియాలో ప్రభుత్వ వ్యతిరేక ప్రచారం తాత్కాలికమేనని, ప్రజలు వాస్తవాలను గుర్తిస్తారని అన్నారు. రాబోయే ఎన్నికల్లో వంద సీట్లు గెలిచి మళ్లీ అధికారంలోకి వస్తామని మహేష్ కుమార్ గౌడ్ ధీమా వ్యక్తం చేశారు.

# ఇఫ్తార్ వేడుకలు సామరస్యానికి నిదర్శనం

**హైదరాబాద్, మార్చి 17 (ప్రభాత ఉదయం)**

జర్నలిస్టుల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా కట్టుబడి ఉందని, వారి సమస్యల పరిష్కారానికి సానుకూల నిర్ణయాలు తీసుకుంటామని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి స్పష్టం చేశారు. పవిత్ర రంజాన్ మాసం క్రమశిక్షణ, సహనం, సేవాభావం, మానవత్వానికి ప్రతీకమని తెలిపారు. తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ జర్నలిస్ట్ యూనియన్ , తెలంగాణ ఉర్దూ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ సంయుక్త ఆధ్వర్యంలో బషీర్‌బాగ్ సురవరం ప్రతాపరెడ్డి ఆడిటోరియంలో నిర్వహించిన దావత్-ఏ-ఇఫ్తార్ కార్యక్రమంలో మంత్రి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, సమాజంలో అట్టడుగు వర్గాల గొంతుకగా నిలిచే జర్నలిస్టులు కులమతాలకు అతీతంగా ఇఫ్తార్ వేడుకలు నిర్వహించడం అభినందనీయమన్నారు. ప్రజాస్వామ్యంలో జర్నలిస్టుల పాత్ర కీలకమని, ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంలో వారు వారధిలా పనిచేస్తున్నారని కొనియాడారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రజా ప్రభుత్వం జర్నలిస్టుల సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తోందన్నారు. జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. జర్నలిస్టుల అక్రిడిటేషన్ విషయంలో ప్రతి ఒక్కరికీ న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామని, అక్రిడిటేషన్ కమిటీలో జర్నలిస్టుల సూచనలను పరిగణనలోకి తీసుకుంటామని తెలిపారు. అలాగే ఇళ్ల స్థలాల కేటాయింపు, హెల్త్ కార్డుల మంజూరు వంటి అంశాల్లో కూడా సానుకూల నిర్ణయాలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. అక్రిడిటేషన్ కార్డుల జారీలో కానీ అక్రిడిటేషన్ కమిటీ ఏర్పాటులో కానీ జర్నలిస్టుల అందరి సలహాలు సూచనలు తీసుకొని ప్రతి ఒక్కరికి న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో తెలంగాణ మీడియా అకాడమీ చైర్మన్ కె. శ్రీనివాస్ రెడ్డి, ఐజేయూ మాజీ అధ్యక్షుడు దేవులపల్లి అమర్, సుల్తాన్ ఉల్ ఉలూమ్ విద్యాసంస్థల సెక్రటరీ జఫర్ జావేద్, పిస్తా హౌస్ సీఈఓ ఎం.ఏ. మజీద్, టీయూడబ్ల్యూజే అధ్యక్షులు కె. విరాహత్‌అలీ, ప్రధాన కార్యదర్శి కె. రామనారాయణ, టీయూడబ్ల్యూజేఎఫ్ అధ్యక్షులు ఎం.ఏ. మజీద్, ప్రధాన కార్యదర్శి సయ్యద్ గౌస్ మొహియుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

# లోక్‌భవన్‌లో ఉగాది ఉత్సవాలు

మొదటి పేజీ తరువాయి...

పరాభవ అంటే.. మనలోని అహంకారాన్ని, చెడు ఆలోచనలను ఓడించి, విజయానికి పునాది వేసేదని అర్థం. ఈ సంవత్సరం మనందరి అభ్యున్నతి సంవత్సరంగా మారుతుందని నా విశ్వాసం అని గవర్నర్ శుక్లా ఆకాంక్షించారు. మన తెలంగాణ రాష్ట్రం మరియు దేశం సర్వతోముఖాభివృద్ధి సాధించాలని ఆకాంక్షిస్తున్నానని అన్నారు. గత అనుభవాల నుండి నేర్చుకుంటూ, మరింత నిబద్ధతతో, సేవాభావంతో మన లక్ష్యాల వైపు అడుగులు వేయాలి. ఉగాది అంటేనే కొత్త శకం. షడ్రుచుల సమ్మేళనమైన ఉగాది పచ్చడి మన జీవితంలోని కష్ట సుఖాల కలయికను సూచిస్తుంది. ఈ ఏడాది రాష్ట్రంలో సమృద్ధిగా వర్షాలు కురిసి, పాడిపంటలతో తెలంగాణ కళకళలాడాలని మనసారా కోరుకుంటున్నాను అని అన్నారు. కార్యక్రమంలో డిప్యూటి సిఎం భట్టి విక్రమార్క,మంత్రులు పొన్నం ప్రభాకర్, శ్రీధర్ బాబు, మండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి పలువురు అధికారులు పాల్గొన్నారు.

ఇదిలావుంటే జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్ విషయంలో స్పీకర్‌దే తుది నిర్ణయమని శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి శ్రీధర్‌బాబు అన్నారు. జీవన్‌రెడ్డిని పార్టీ ఎప్పుడూ నిర్లక్ష్యం చేయలేదన్నారు. బడ్జెట్ సమావేశాలకు ప్రతిపక్షనేత కేసీఆర్ రావాలని కోరారు. కేసీఆర్ అనుభవం అసెంబ్లీకి అవసరం. మంత్రుల మార్పులు, చేర్పుల్లో సీఎంకే పూర్తి స్వేచ్ఛ ఉందని శ్రీధర్‌బాబు అన్నారు.

# కాబూల్ ఆస్పత్రిపై పాక్ వైమానిక దాడి

మొదటి పేజీ తరువాయి...

పెరిగే అవకాశం ఉందని తాలిబన్ ప్రభుత్వం తెలిపింది. ఇదిలాఉంటే.. అఫ్గాన్ ప్రభుత్వ ఆరోపణల్ని పాకిస్థాన్ కొట్టిపడేసింది. కాబూల్‌లోని ఏ ఆస్పత్రిని కూడా తాము టార్గెట్ చేసుకోలేదని పేర్కొంది. అఫ్గానిస్థాన్ చెప్పేదాంట్లో నిజాలు లేవంది. ఇదిలావుంటే పాకిస్థాన్, అఫ్గానిస్థాన్ దేశాల మధ్య ఘర్షణలు మూడో వారానికి చేరుకున్నాయి. ఇరుపక్షాలు భీకర దాడులకు పాల్పడుతున్నాయి. సరిహద్దుల్లో పాకిస్థాన్ కాల్పుల విరమణ ఒప్పందాన్ని ఉల్లంఘిస్తోందని.. పాక్ సైనికులు జరిపిన కాల్పుల్లో నలుగురు అఫ్గాన్ సైనికులు చనిపోయినట్లు ఆ దేశాధికారులు చెప్పారు. ఈ ప్రకటన వెలువడిన కొన్ని గంటల్లోనే కాబుల్‌లోని ఆస్పత్రిపై వైమానిక దాడికి పాల్పడినట్లు అఫ్గాన్ ఆరోపించింది.'కాబుల్‌లోని డి అడిక్షన్ సెంటర్‌పై పాక్ వైమానిక దళం దాడి చేసింది. ఈ దాడిలో భారీ ప్రాణ నష్టం జరిగింది. చాలా మంది గాయపడ్డారు. పాకిస్థాన్ చర్యను తీవ్రంగా ఖండిస్తున్నాం. దీనికి తగిన గుణపాఠం చెబుతాం' అని తాలిబన్ ప్రభుత్వ ప్రతినిధి జబీహుల్లా ముజాహిద్ తెలిపారు. అఫ్గానిస్థాన్ రాజధాని కాబూల్‌లోని ఆస్పత్రిపై పాక్ వైమానిక దాడికి సంబంధించిన వీడియోలు సోషల్‌మీడియాలో వైరల్‌గా మారాయి. దాడి అనంతరం ఆస్పత్రిలో భారీ పేలుడు సంభవించడంతో.. ఆకాశంలోని భారీగా మంటలు ఎగిసిపడుతున్న దృశ్యాలు అందులో రికార్డయ్యాయి. మరో వీడియోలో భద్రతా సిబ్బంది టార్చ్‌లైట్ వెలుగులో శిథిలాల కింద నుంచి మృతదేహాలను వెలికి తీస్తుండగా, అగ్నిమాపక సిబ్బంది మంటలను ఆర్పేందుకు ప్రయత్నిస్తున్నారు. కాబూల్‌లోని డ్రగ్స్ రిహాబిలేషన్‌కు సంబంధించిన ఆస్పత్రిపై సోమవారం రాత్రి 9 గంటలకు పాక్ వైమానిక దాడి జరిపిందని ఆఫ్గానిస్థాన్ డిప్యూటీ ప్రభుత్వ ప్రతినిధి హమ్దుల్లా ఫిత్రత్ తెలిపారు. ఈ దాడిలో ఆస్పత్రి భవనం చాలావరకు ధ్వంసమైందని పేర్కొన్నారు. దాడుల్లో 400 మంది వరకు మరణించారని.. సుమారు 250 మంది గాయపడ్డారని చెప్పారు. వైమానిక దాడులతో ఆస్పత్రి భవనంలో పెద్ద ఎత్తున మంటలు చెలరేగాయని.. వాటిని అదుపులోకి తీసుకురావడానికి అగ్నిమాపక సిబ్బంది కృషి చేస్తున్నారని పేర్కొన్నారు. దాడిలో మాదక ద్రవ్యాలకు బానిసలైన వారి చికిత్స కోసం ఉపయోగిస్తున్న పరికరాలు చాలా వరకు ధ్వంసమయ్యాయని అఎ÷-గాన్ ఆరోగ్య శాఖ ప్రతినిధి షరాఫత్ జమాన్ తెలిపారు. మృతుల్లో ఎక్కువగా రోగులే ఉన్నారని పేర్కొన్నారు. కాగా, పాక్ దాడిని ఆఎ÷-గానిస్థాన్ ప్రభుత్వ ప్రతినిధి జబీహుల్లా ముజాహిద్ తీవ్రంగా ఖండించారు. ఇది అఎ÷-గాన్ సార్వభౌమాధికారాన్ని ఉల్లంఘించే చర్యేనని అభివర్ణించారు. కాబూల్‌లోని ఆస్పత్రి లక్ష్యంగా దాడులు చేశారని ఆఎ÷-గానిస్థాన్ చేసిన ఆరోపణలను పాకిస్థాన్ తీవ్రంగా ఖండించింది. ఆస్పత్రి లక్ష్యంగా ఎటువంటి దాడులు జరపలేదని స్పష్టం చేసింది. తాలిబాన్ సైనిక స్థావరాలు, ఆయుధ గోదాములు, ఉగ్రవాద మద్దతు కేంద్రాలే లక్ష్యంగా కచ్చితమైన దాడి చేశామని పాకిస్థాన్ సమాచార మంత్రిత్వ శాఖ వెల్లడించింది. పౌరులకు, ఆస్తులకు ఎటువంటి నష్టం జరగకుండానే జాగ్రత్త పడుతూనే దాడులు చేశామని స్పష్టం చేసింది.

# హ్యామ్ రోడ్ల పేరుతో 18వేల కోట్ల కుంభకోణం

మొదటి పేజీ తరువాయి...

జరుగుతోంది. హ్యామ్ రోడ్ల పేరుతో రూ.18 వేల కోట్ల కుంభకోణానికి తెరలేపారు. రోడ్స్ అండ్ బిల్డింగ్స్ లో రూ.12 వేల కోట్లు, పంచాయతీ రాజ్ డిపార్ట్‌మెంట్‌లో రూ.6 వేల కోట్లు కలిపి భారీ స్థాయిలో అవకతవకలు జరుగుతున్నాయి. గతంలో కాంగ్రెస్ ప్రభుత్వం మొబిలైజేషన్ అడ్వాన్స్‌లు ఇస్తే అప్పటి ప్రతిపక్ష నాయకుడు రేవంత్ రెడ్డి వద్దు అని గొడవ పెట్టారు. ఇప్పుడు అదే ప్రభుత్వం 10 శాతం మొబిలైజేషన్ ఇస్తోంది. ఇందులో కమిషన్లు తీసుకుని ఎన్నికల ఖర్చు కోసం పంపబోతున్నారు. ఈ వ్యవహారం పెద్ద స్థాయి స్కాం గా మారే ప్రమాదం ఉంది' అని ఆరోపించారు. ఈ టెండర్లకు సీఓటీ అనుమతి కూడా అవసరం లేకుండా, డిపార్ట్‌మెంట్ స్థాయిలోనే అనుమతులు ఇచ్చేలా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారని హరీష్ రావు ఆగ్రహం వ్యక్తం చేశారు. మొత్తం 34 టెండర్ ప్యాకేజీలలో ఇప్పటికే 24 టెండర్లు ఓపెన్ చేసినట్లు తెలిపారు. కాంట్రాక్టర్ల మధ్య కుమ్మక్కుతో 20 నుంచి 30 శాతం వరకు అధిక ధరలకు టెండర్లు వేయించారని కూడా ఆరోపించారు. ఈ విషయంపై సమగ్ర విచారణ జరిపించాలని, ప్రజల డబ్బును కాపాడాలని హరీష్ రావు డిమాండ్ చేశారు.

# రోహిత్ రెడ్డికి బీఆర్ఎస్ బిగ్ షాక్

## షోకాజ్ నోటీసులు జారీ

**హైదరాబాద్, మార్చి 17 (ప్రభాత ఉదయం)**

మాజీ ఎమ్మెల్యే పైలెట్ రోహిత్ రెడ్డికి బీఆర్ఎస్ బిగ్ షాక్ ఇచ్చింది. రోహిత్‌కు పార్టీ అధిష్ఠానం షోకాజ్ నోటీసులు జారీ చేసింది. డ్రగ్స్ కేసుకు సంబంధించిన ఆరోపణల నేపథ్యంలో మాజీ ఎమ్మెల్యేకు బీఆర్ఎస్ షోకాజ్ నోటీసులు ఇచ్చింది. 'డ్రగ్స్ కేసులో మీ ప్రమేయం ఉన్నట్లు మీడియా ద్వారా వార్తలు వచ్చాయి. అదే విధంగా పోలీస్ కేసు నమోదు అయిన నేపథ్యంలో క్రమశిక్షణ చర్యలు తీసుకోవడానికి నోటీసులు జారీ చేసినట్లు' నోటీసుల్లో పేర్కొంది. ఈ వ్యవహారం వల్ల పార్టీకి నష్టం జరుగుతుందని, పార్టీ కార్యక్రమాలకు దూరంగా ఉండాలని రోహిత్ రెడ్డికి పార్టీ ప్రధాన కార్యదర్శి పేరుతో నోటీసులు జారీ అయ్యాయి. ఈ అంశంపై ఏడు రోజుల్లోగా వివరణ ఇవ్వాలని బీఆర్ఎస్ ఆదేశించింది. గడువులోపు సంతృప్తికరమైన వివరణ ఇవ్వకపోతే ఎలాంటి నోటీసులు ఇవ్వకుండానే క్రమశిక్షణాత్మక చర్యలు తీసుకుంటామని పార్టీ అధిష్ఠానం హెచ్చరించింది. ఇకపోతే పైలట్ రోహిత్ రెడ్డి వ్యవహారాన్ని బీఆర్ఎస్ పార్టీ అధినేత కేసీఆర్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. మీడియా ద్వారా వచ్చిన ఆరోపణలపై వారం రోజుల్లోగా స్పష్టంగా లిఖిత పూర్వక వివరణ ఇవ్వాలని ఆదేశించారు. షోకాజు నోటీసుకు గడువులోపు వివరణ సమర్పించకపోతే.. పార్టీ నియమావళి ప్రకారం వేటు వేస్తామని హెచ్చరిం చారు. కేసీఆర్ ఆదేశాల మేరకు పార్టీ ప్రధాన కార్యదర్శి, పార్టీ క్రమశిక్షణా వ్యవహారాల బాధ్యులు సోమ భరత్ కుమార్ షోకాజ్ నోటీసు జారీ చేశారు. హైదరాబాద్ పరిసర ప్రాంతాల్లో జరిగిన ఒక సమావేశంలో హాజరైన సమయంలో, అక్కడ మాదక ద్రవ్యాలు వినిగియోంచారని వివిధ మీడియా నివేదికలు, ఇతర విశ్వసనీయ సమాచారం ద్వారా పార్టీ ఉన్నత నాయకత్వం దృష్టికి వచ్చిందని షోకాజ్ నోటీసుల్లో తెలిపారు. ఈ వార్తలు విస్తృతంగా మీడియాలో ప్రసారం కావడంతో పాటు పార్టీకి, ప్రజల్లో కూడా తీవ్ర ఆందోళనలు కలిగించాయని పేర్కొన్నారు. బీఆర్ఎస్ పార్టీ ఒక బాధ్యతాయుతమైన రాజకీయ సంస్థగా చట్టపరమైన నిబంధనలు, నైతిక విలువలు పాటించడంలో విశ్వాసం కలిగిందని నోటీసుల్లో పేర్కొన్నారు.

# ముస్లిం సోదరులకు రంజాన్ తోఫాను అందజేసిన ఎమ్మెల్యే



రంజాన్ కనుకలను ముస్లిం సోదరులకు అందజేస్తున్న ఎమ్మెల్యే జిఎంఆర్




ముస్లిం సోదరులనుదేశించి మాట్లాడుతున్న ఎమ్మెల్యే జిఎంఆర్

**కొత్తకోట, మార్చి 17(ప్రభాత ఉదయం)**

రంజాన్ పండుగని పురస్కరించుకొని పట్టణంలోని ఖాద్రి మసీదులో ముస్లిం సోదరులతో కలసి ఎమ్మెల్యే ప్రత్యేక ప్రార్థనలో పాల్గొన్నారు. అనంతరం క్యూ ఆర్ ఫంక్షన్ హాల్ లో రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన రంజాన్ తోపాను ముస్లిం సోదరులకు అందజేశారు. అనంతరం విందులో ఎమ్మెల్యే పాల్గొని మాట్లాడుతూ. కులాలకు మతాలకు అతీతంగా జరుపుకునే పండుగ రంజాన్ పండుగని మైనార్టీ సోదరులు పండగను సుఖ సంతోషాలతో జరుపుకోవాలని కాంగ్రెస్ ప్రభుత్వం పై మాపై అల్లా దీవెనలు ఎల్లప్పుడూ ఉండాలని అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు మైనార్టీ సోదరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ భూమి కబ్జాకు గురి కాకుండా సహకరించిన ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ ను సన్మానించిన ప్రణామభక్త సమాజం సభ్యులు

## ప్రభుత్వ భూములు కాపాడాల్సిన అవసరం ఉంది:ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్

**బుద్వేల్/రాజేంద్రనగర్,మార్చి17(ప్రభాత ఉదయం)**

రాంబాగ్ శివాలయం,కాలా హనుమాన్ దేవాలయం పరిసర ప్రభుత్వ భూమి పరిరక్షణలో ఎమ్మెల్యే ప్రకాశ్ గౌడ్ చూపిన చొరవ మరువలేనిదని పలువురు నాయకులు అన్నారు.అత్తాపూర్ సీతారామచంద్రస్వామి దేవాలయం, రాంబాగ్ శివాలయం దేవాలయం పరిసరాల లోని ప్రభుత్వ భూమిలోజరిగిన ఆక్రమణలను తొలగించడంలో కీలక పాత్ర ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ ను మంగళవారం ప్రణవ భక్త సమాజం సభ్యులు ఘనంగా సన్మానించారు.ఈ మేరకు ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ ను ఆయా పార్టీల నాయకుడు స్థానికులు మర్యాదపూర్వకంగా కలిసి ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు.రాంబాగ్,పాండురంగ నగర్,హుడా కాలనీ,అత్తాపూర్,నంది ముసలైగూడ,హైదర్‌గూడ,ఉప్పర్‌పల్లి,శాంతినగర్ ప్రాంతాల ప్రజలు,భక్తులు కలిసి రాంబాగ్ రామాలయం,శివాలయం,కాలా హనుమాన్ దేవాలయం పరిసర ప్రాంతంలో ఉన్న ప్రభుత్వ భూమిపై జరిగిన అక్రమ ఆక్రమణలను వ్యతిరేకించారు. తొలగించడంలో కీలక పాత్ర పోషించిన ఎమ్మెల్యే ప్రకాశ్ గౌడ్ కు కృతజ్ఞతలు తెలిపారు.ఎమ్మెల్యే ప్రకాశ్ గౌడ్ చొరవ,నాయకత్వం,పట్టుదలతో సంబంధిత అధికారుల ద్వారా అక్రమ ఆక్రమణలను తొలగించే చర్యలు తీసుకోబడినట్లు ప్రజలు తెలిపారు.ఈ చర్యలు దేవాలయాల పరిసర ప్రాంతాన్ని,ప్రభుత్వ భూమిని రక్షించడంలో ఎంతో కీలకంగా నిలిచాయి.ప్రజల అభ్యర్థనలను గౌరవించి వెంటనే స్పందించిన ఎమ్మెల్యేకు ప్రజలు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.అందరూ కలిసికట్టుగా పనిచేయడం వల్లే ఈ మంచి ఫలితం సాధ్యమైందని వారు పేర్కొన్నారు. రాంబాగ్,పరిసర కాలనీల ప్రజలు కలిసి దేవాలయాల పరిసర ప్రాంతాన్ని,ప్రభుత్వ భూమిని పరిరక్షించడంలో సహకరించిన ఎమ్మెల్యే ప్రకాశ్ గౌడ్ మరొక్కసారి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మేడం మధు,సామ ఇంద్రపాల్ రెడ్డి, చెరుకు అమరేందర్,భాస్కర్ గౌడ్,మిద్దెల సురేష్ రెడ్డి,ఎన్ మల్లారెడ్డి,కొమురయ్య,విజయ్, మ్యాడమ్ రామేశ్వరరావు,వనం శ్రీరామ్ రెడ్డి,సుభాష్ రెడ్డి,స్థానిక బస్తీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ సన్మానించిన ప్రణవభక్త సమాజం ప్రతినిధులు




పోలీసుల అదుపులో నిందితుడు

# ఆన్లైన్ మోసాలు చేస్తున్న వ్యక్తులు అరెస్ట్

## 3880 మందిని మోసం చేసిన నిందితులు

## నలుగురు నిందితులు అరెస్ట్.. 14 లక్షల నగదు స్వాదినం

**బుద్వేల్, మార్చి 17 (ప్రభాత ఉదయం**

ఆఫర్ల పేరుతో అమాయక ప్రజలను మోసం చేస్తున్న నలుగురు నిందితులను శంషాబాద్ జోన్, టాస్క్ ఫోర్స్ సిబ్బంది, రాజేంద్రనగర్ పోలీసులు అరెస్ట్ చేశారు. టాస్ఫోర్స్ సిఐ వెంకట్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం... బెంగళూరుకు చెందిన విజయ్ కుమార్ లాక్ డౌన్ కి ముందు ఆన్లైన్లో మొబైల్ ఫోన్ ఆర్డర్ చేశాడు. అప్పట్లో ఫోన్ స్థానంలో చిన్న బ్లూటూత్ స్పీకర్, వచ్చింది. డబ్బులు తిరిగి ఇచ్చేయాలని సంబంధిత వ్యక్తులకు ఎన్నిసార్లు ఫోన్ చేసినా ప్రయోజనం లేకపోయింది. లాక్ డౌన్ సమయంలో ఆర్థిక ఇబ్బందుల కారణంగా సులువుగా డబ్బులు సంపాదించాలని దురాలోచనతో పథకం వేశాడు. అప్నా జాబ్ ఆప్ ద్వారా టెలికాలర్లను నియమించి ఆయుర్వేద మందులు అమ్మేపేరుతో ఉద్యోగాలు ఇచ్చాడు. మరికొందరితో కలసి బీధర్ నగరంలోని హైదర్ గూడ గుడిమల్కాపూర్ ప్రాంతాలకు వ్యాపారాన్ని విస్తరించాడు. విజయ్ కుమార్ మంజుల అనే మహిళ నుంచి లక్ష మొబైల్ ఫోన్ల డాటాను రూ.10 వేలు ఇచ్చి కొనుగోలు చేశాడు. అలా సేకరించిన మొబైల్ ఫోన్లకు తాను నియమించుకున్న టెలికాలర్ల ద్వారా మీకు ఆఫర్ లో సామ్సంగ్ స్మార్ట్ ఫోన్ వచ్చింది. మీరు రూ. 3,500లు చెల్లిస్తే మీకు ఫోన్ పంపిస్తామని నమ్మబలికేవారు. డబ్బులు అందాక వారికి బ్లూటూత్ స్పీకర్లు, చిన్న చిన్న సామాగ్రి పంపించి మోసం చేసేవారు.2021 నుంచి ఇప్పటి వరకు అతను 3,880 మందిని మోసం చేసాడు.మంగళవారం విస్వసనీయ సమాచారం మేరకు శంషాబాద్ టాస్క్ ఫోర్స్ పోలీసులు, రాజేంద్రనగర్ పోలీసులు హైదర్ గూడ వద్ద విజయ్ కుమార్ తో పాటు కాటేదాన్ కు చెందిన శివ కుమార్, భవాని నగర్ కు చెందిన ముద్దీన్, హైదర్ గూడ కు చెందిన శశికాంత్ అరెస్ట్ చేసి వారి వద్ద నుంచి పలు సామాగ్రి తో పాటు ఎయిర్టెల్, వోడాఫోన్, బీఎస్ఎన్ఎల్ లాంటి 51 సిమ్ములు, రూ.14లక్షల నగదు ను స్వాధీనం చేసుకున్నారు.

### మైలార్‌దేవ్‌పల్లి డ్రైనేజ్ డివిజన్లో

# సమస్యలు పరిష్కరించాలి

## తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు ఉస్కెమూరి విజయ్ కుమార్

**రాజేంద్రనగర్,మార్చి17(ప్రభాత ఉదయం)**



మైలార్ దేవ్ పల్లి డివిజన్ లో ప్రజలు డ్రైనేజీ సమస్యలతో ఇబ్బందులు పడుతున్నారని ఈ మేరకు పరిష్కారం చూపాలని డివిజన్ తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు ఉస్కెమూరి విజయ్ కుమార్ అన్నారు.ఈ మేరకు డివిజన్ జలమండలి అధికారులను కోరారు.అధికారులను కలిసి వినతి పత్రాన్ని అందజేశారు.అనంతరం ఆయన మాట్లాడుతూ..డివిజన్ పరిధిలో పలు కాలనీలు డ్రైనేజీ సమస్యలతో నిత్యం సతమతం అవుతున్నారని అన్నారు.మురుగునీరు రోడ్లపై రావడం వర్షాకాలం వస్తే అడుగు తీసి అడుగులు వేయలేని పరిస్థితులు నెలకొంటున్నాయని అన్నారు.ప్రధానంగా శాంతినగర్,టీఎన్జీవోఎస్ కాలనీ,హౌసింగ్ బోర్డ్ కాలనీ, మధుబన్ కాలనీ,గగన్ పహాడ్,లక్ష్మీగూడ,వాంబే కాలనీ వంటి ప్రాంతాలలో డ్రైనేజీ సమస్యలు తీవ్రంగా ఉన్నాయని అన్నారు.ఈ మేరకు చర్యలు తీసుకోవాలని అధికారులను కోరడంతో వారు సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో విజయ్ కుమార్,సత్తిబాబు,శంకర్,ప్రవీణ్ కుమార్,శ్రీనివాస్,గీత, గండప్ప, యాదగిరి,బస్తివాసులు తదితరులు పాల్గొన్నారు.




# కుందేళ్ళ పెంపకంతో ఉపాధి: డాక్టర్ మాధురి

**రాజేంద్రనగర్,మార్చి17(ప్రభాత ఉదయం)**

పీవీ నరసింహారావు తెలంగాణ పశు వైద్య విశ్వ విద్యాలయం,పశు జన్యు వనరుల విభాగం,కుందేళ్ళ పరిశోధన కేంద్రం ఆధ్వర్యంలో జాతీయ మాంస పరిశోధన సంస్థ సహకారంతో షెడ్యూల్డ్ కులాల రైతులకు ఒక రోజు శిక్షణ నిర్వహించారు.ఈ కార్యక్రమంలో అసోసియేట్ డీన్ డాక్టర్ మాధురి పాల్గొన్నారు.ఈ సందర్భంగా కుందేళ్ళ పెంపకం ద్వారా ప్రత్యామ్నాయ మాంస ఉత్పత్తి వనరుగా ఉంటుందని వివరించారు.ఈ సందర్భంగా మాధురి మాట్లాడుతూ...గ్రామీణ ప్రాంతాలలో సాధారణంగా వ్యవసాయంతో అనుబంధం రంగంగా కుందేళ్ళ పెంపకం చేసి ఉపాధితో పాటు ఆర్థికంగా లాభదాయకంగా ఉంటుందని తెలిపారు.అనంతరం డాక్టర్ ఏకాంబరం డిపార్ట్మెంట్ హెడ్,కుందేళ్ళ పెంపకం వల్ల లాభాలను సోదరణంగా వివరించారు.అలాగే ఈ మాంసంలో తక్కువ కొలెస్ట్రాల్,అధిక పోషక విలువలు కలిగి అన్ని వయసుల వారికి అనుకూలంగా ఉంటుందని తెలియచేశారు.డాక్టర్ సాయి రెడ్డి,డాక్టర్ స్వాతి రాబిట్ ఫామ్,ఇంచార్జీ డాక్టర్ సరిన్, డాక్టర్ కార్తీక,డాక్టర్ జగదీష్,కుందేళ్ళ పోషణ,ఆరోగ్య సంరక్షణ,మార్కెటింగ్ మొదలగు అంశాలపై రైతులకు వివరించారు.అలాగే సేవా స్ఫూర్తి ఫౌండేషన్ ప్రాజెక్ట్ మేనేజర్ రత్నాకర్ గారు గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న మహిళకు,యువత,కుందేళ్ళ పెంపకం చాలా ఉపాధి పొందటంతో పాటు లాభదాయకంగా ఉంటుందని తెలిపారు.

# డ్రైనేజీ సమస్యలు పరిష్కరించాలి

## విజయ్ కుమార్

**బుద్వేల్, మార్చి 17 (ప్రభాత ఉదయం)**

మైలార్ దేవ్ పల్లి డివిజన్ పరిధిలో డ్రైనేజీ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకుడు విజయ్ కుమార్ జలమండలి మేనేజర్ కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా విజయకుమార్ మాట్లాడుతూ.. డివిజన్ పరిధిలోని శాంతినగర్ కాలనీ, హౌసింగ్ బోర్డ్, టీఎన్జీవోస్ కాలనీ, వాంబే కాలనీ, కాటేదాన్, గగన్ పహాడ్, లక్ష్మీగూడ, మధుబన్ కాలనీ, పద్మశాలిపురం ప్రాంతాలలో డ్రైనేజీ సమస్యలు తీవ్రంగా ఉన్నాయని తెలిపారు. సరైన సిబ్బంది లేని కారణంగా ప్రధాన రహదారులన్నీ మురుగు నీటితో పొంగి పొర్లుతున్నాయని తెలిపారు. తక్షణమే పొంగిపొర్లుతున్న డ్రైనేజీలను శుభ్రం చేసి ప్రజలకు శాశ్వత పరిష్కారం కల్పించాలని విజ్ఞప్తి చేశారు. వినతి పత్రం అందజేసిన వారిలో అమర్ సత్తిబాబు, శంకర్, ప్రవీణ్ కుమార్, శ్రీనివాస్ గౌడ్, గండప్ప, యాదగిరి, మణి తదితరులు ఉన్నారు.



జలమండలి అధికారి కి వినతి పత్రం అందచేస్తున్న యు విజయ్ కుమార్

### బీజేపీ రంగారెడ్డి జిల్లా ఐటీ ఇన్‌చార్జ్‌గా నియమితులైన

# వెంకట్ రమణ గుప్తను సన్మానించిన ఆ పార్టీ నాయకులు




వెంకట రమణాను శాలువాతో సత్కరిస్తున్న వినయ్ కుమార్ రెడ్డి

**రాజేంద్రనగర్, మార్చి17 (ప్రభాత ఉదయం)**

బీజేపీ రంగారెడ్డి జిల్లా ఐటీ ఇన్‌చార్జ్‌గా నియమితులైన వెంకట్ రమణ గుప్త ను మైలార్దేవ్‌పల్లి డివిజన్ బీజేపీ అధ్యక్షుడు సూరెడ్డి వినయ్ రెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలియజేశారు. కాటేదాన్ డివిజన్ పరిధిలోని బాబుల్ రెడ్డి నగర్‌కు చెందిన వెంకట్ రమణ గుప్త కి బీజేపీ రంగారెడ్డి జిల్లా ఐటీ ఇన్‌చార్జ్‌గా నియమితులయ్యారు. వెంకట్ రమణ గుప్త 2001 సంవత్సరం నుంచి బీజేపీకి అంకితభావంతో సేవలందిస్తూ, పార్టీ సిద్ధాంతాలు, నియమ నిబంధనలను కచ్చితంగా పాటిస్తూ ముందుకు సాగుతున్నారు. ఐటీ రంగంలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగిగా పనిచేస్తూనే, పార్టీ కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొంటూ నిజాయితీ గల కార్యకర్తగా నిలిచారు.ఈ సందర్భంగా నిర్వహించిన శాలువా సన్మానం కార్యక్రమంలో ఓబీసీ రాష్ట్ర నాయకులు అడికే రాజు , వై నర్సిరెడ్డి , బల్ల శ్రీనివాస్ యాదవ్ , గురుడి అంజి , కొండల , వేణు , జోగు విజయ్ , ప్రేమ్ , మహేష్ , వినోద్ , శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.వారికి అప్పగించిన బాధ్యతలను విజయవంతంగా నిర్వహించి, పార్టీ అభివృద్ధికి మరింత కృషి చేయాలని ఆకాంక్షించారు.

### సోషల్ మీడియాలో

# అసభ్యకరమైన కామెంట్ పోస్ట్ చేసిన నిందితుడిని అరెస్టు

**శేరిలింగంపల్లి : మార్చి 17, (ప్రభాత ఉదయం)**



సోషల్ మీడియా ప్లాట్‌ఫారమ్‌లో అభ్యంతరకరమైన కామెంట్ పోస్ట్ చేసిన కేసును సైబరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసులు ఛేదించారు. దర్యాప్తులో భాగంగా, సదరు కంటెంట్‌ను పోస్ట్ చేసిన నిందితుడిని గుర్తించి అదుపులోకి తీసుకున్నారు. సైబరాబాద్ సైబర్ డీసీపీ తెలిపిన వివరాలు ఇలావున్నాయి. నిందితుడిని సెక్యూరిటీ గార్డుగా పనిచేస్తున్న కోటిపల్లి వెంకన్నగా గుర్తించారు. అతను తన ఖాళీ సమయంలో తరచుగా ఇన్‌స్టాగ్రామ్‌లో రీల్స్ చూస్తుండేవాడు. ఇటీవల ఇన్‌స్టాగ్రామ్ చూస్తున్న సమయంలో న్యూస్ పేజీ పోస్ట్ చేసిన నటి రేణు దేశాయ్ కి సంబంధించిన ఒక రీల్‌ను నిందితుడు చూశాడు. ఆ రీల్ చూసిన తర్వాత, నిందితుడు తన ఇన్‌స్టాగ్రామ్ ఖాతా నుండి ఒక అసభ్యకరమైన కామెంట్‌ను పోస్ట్ చేశాడు. నిందితుడి కోసం గాలిస్తున్న సమయం మాదాపూర్‌లో ఉండగా, సైబర్ క్రైమ్ పోలీసులు అతనిని అదుపులోకి తీసుకున్నారు. అతనికి అరెస్ట్ గల కారణాలను వివరించి గచ్చిబౌలిలోని సైబర్ క్రైమ్ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. విచారణలో భాగంగా, నిందితుడు సదరు కామెంట్‌ను పోస్ట్ చేయడానికి ఉపయోగించిన తన వివో మొబైల్ ఫోన్‌ను పోలీసులకు స్వాధీనం చేసుకున్నారు. సోషల్ మీడియా వినియోగదారులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని ఎవరినీ దూషించేలా, కించపరిచేలా లేదా అసభ్యకరంగా ఉండే కామెంట్లను పోస్ట్ చేయకూడదని డీసీపీ సాయి మనోహర్ సూచించారు. సోషల్ మీడియా వేదికలపై అభ్యంతరకరమైన కంటెంట్‌ను పోస్ట్ చేయడం వల్ల చట్టపరమైన నిబంధనల ప్రకారం కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని వివరించారు. పౌరులు డిజిటల్ ప్లాట్‌ఫారమ్‌లను బాధ్యతాయుతంగా ఉపయోగించాలని ఏవైనా సైబర్ నేరాలు జరిగితే వెంటనే సమీపంలోని సైబర్ క్రైమ్ పోలీస్ స్టేషన్‌లో లేదా 1930 సైబర్ హెల్ప్‌లైన్ ద్వారా ఫిర్యాదు చేయాలని సూచించారు.

### వాసవీ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్‌లో.. ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్


# హ్యూమనాయిడ్ రోబోట్స్‌పై రెండు రోజుల వర్క్ షాప్

**లంగర్ హౌజ్, మార్చి 17 ( ప్రభాత ఉదయం):**

నగరంలోని ఇబ్రహీంబాగ్ లో గల వాసవీ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ లో సోమ, మంగళవారాలలో ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్ హ్యూమనాయిడ్ రోబోట్స్ పై రెండు రోజుల వర్క్ షాప్ నిర్వహించారు. ఎడ్యుబోటిక్స్ సహకారంతో రోబోటిక్స్ క్లబ్ ఆధ్వర్యంలో మెకానికల్ ఇంజనీరింగ్ హెడ్ ఆఫ్ ద డిపార్ట్మెంట్ రామ్మోహన్ రావు , హెడ్ ఆఫ్ ఈవెంట్ పి సుబాషిణి ల ఆధ్వర్యంలో ఈ వర్క్ షాప్ జరిగింది. ఈ కార్యక్రమాన్ని ఏఎస్ఎం ఈ విద్యార్థి వర్గం సహకారంతో నిర్వహించగా, అన్ని విభాగాల విద్యార్థులకు అందుబాటులో ఉంచారు. ఈ సందర్భంగా రామ్మోహన్ రావు , పి సుబాషిణి లు మాట్లాడుతూ, విద్యార్థులు రోబోట్ ల తల, చేతులు, కదలికలను నియంత్రించడం వంటి అం శాలలో ప్రత్యక్ష అనుభవం పొందారన్నారు. తమ స్వంత డివైజెస్ ద్వారా రోబోట్ ను కనెక్ట్ చేసి అపరేట్ చేయడం గురించి నేర్చుకున్నారని గుర్తు చేశారు. ఈ సెషన్లలో కంప్యూటర్ విజన్ గురించి ప్రాథమిక మాడల్ ను ట్రైన్ చేయించడం జరిగిందన్నారు. మొత్తం మీద ఈ వర్క్ షాప్ రోబోటిక్స్, ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్ పై లోతైన, ఆకర్షణీయమైన అనుభవాన్ని అందించింది. ఈ వర్క్షాప్ ఉత్సాహ భరితమైన, ఇంట్రాక్టివ్ వాతావరణాన్ని సృష్టించిందని తెలిపారు. ఇందులో విద్యార్థులు వాస్తవ జీవితంలో ఏఈ, రోబోటిక్స్ వినియోగాలను అన్వేషించారన్నారు. ఎడ బాటిక్స్ టీమ్ మార్గదర్శకత్వంలో వారు హ్యూమనాయిడ్ రోబోట్ లతో నేరుగా పనిచేయడం ద్వారా ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించుకున్నారని గుర్తు చేశారు. కొత్త సాంకేతికతలను స్వయంగా ప్రయత్నించారన్నారు. ఈ అనుభవం విద్యార్థులలో ఆసక్తి, ఉత్సాహాన్ని పెంచి నేర్చుకునే ప్రక్రియను సరదగా, ప్రయోజనకరంగా మార్చిందని తెలిపారు.



వర్క్ షాప్‌లో పాల్గొన్న అధ్యాపకులు, విద్యార్థులు...



రోబోట్

## నిబద్ధత, క్రమశిక్షణతో పనిచేయండి


# భవిష్యత్ తరాలకు ఆదర్శంగా నిలవండి: ఎమ్మెల్యే జిఎంఆర్

కొత్తకోట మార్చి 17 (ప్రభాత ఉదయం)



మున్సిపల్ కౌన్సిల్ సమావేశంలో సభ్యుల ఉద్దేశించి మాట్లాడుతున్న ఎమ్మెల్యే జిఎంఆర్

నిబద్ధత క్రమశిక్షణ తో ప్రజలకు పని చేసి భవిష్యత్ తరాలకు ఆదర్శంగా నిలవాలని దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూదన్ రెడ్డి అన్నారు. కొత్తకోట మున్సిపల్ కార్యాలయం లో మంగళవారం నిర్వహించిన జనరల్ బాడీ సమావేశంలో స్థానిక మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్, కౌన్సిలర్లతో కలసి దేవరకద్ర ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఈ సందర్భంగా డ్రైనేజీ, స్ట్రీట్ లైట్స్, ట్రాఫిక్, పారిశుద్ధ్య నిర్వహణ పనులు, సీసీ రోడ్లు, త్రాగునీరు, విద్యుత్, మౌలిక వసతులు తదితర అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.ఎన్నికల సమయంలో మీరు ప్రజలకు ఇచ్చిన హామీలు, ప్రజల ఇబ్బందులు తీర్చడానికి నిరంతరం కృషి చేయండి, నా వంతు పూర్తి సహకారం అందజేస్తానని అన్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేయాలని అన్నారు. కొత్తకోట మున్సిపాలిటీ అభివృద్ధికి సంబంధించి ఇటీవలే 17 కోట్లతో అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన చేసుకున్నామని. మున్సిపాలిటీ అభివృద్ధికి సంబంధించి, నిన్న అసెంబ్లీలో రేవంత్ రెడ్డి తో చర్చించడం జరిగింది, నిధులు కేటాయించడానికి ముఖ్యమంత్రి గారు సానుకూలత వ్యక్తం చేశారని చెప్పారు.వేసవిని దృష్టిలో ఉంచుకుని, నీటి సమస్యలు తలెత్తకుండా, అధికారులు, ప్రజాప్రతినిధులు ముందస్తు ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని ఆదేశించారు.6 కోట్ల రూపాయల నిధులతో సిసి రోడ్లు, డ్రైనేజీల నిర్మాణానికి, 2 కోట్ల రూపాయల నిధులతో పార్కుల డెవలప్మెంట్ కు నిధులు మంజూరు చేశానని 1 కోటి, 50 లక్షల నిధులతో స్ట్రోమ్ వాటర్, డ్రైన్ల నిర్మాణానికి, 5 కోట్ల నిధులతో చేనగ చెరువు కట్ట పై, వెంకటగిరి రహదారిపై సంత బజార్ ఏర్పాటు చేయడంతో పాటు వాకింగ్ ట్రాక్ ఏర్పాటు చేసి బ్యూటిఫికేషన్ పనులు త్వరలో పనులు జరుగుతాయని చెప్పారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ అరుణ శ్రీనివాస్, కమిషనర్ సైదయ్య, వైస్ చైర్మన్ పల్లవి కృష్ణారెడ్డి, కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు.



# రైతులకు నేరుగా ఏరియా కంపెనీ చేయాలి

గద్వాల జిల్లా ప్రతినిధి, మార్చి 14 (ప్రభాత ఉదయం)

రైతులకు పంపిణీ చేసే యూరియా 'ఫర్టిలైజర్స్ యాప్' ద్వారా కాకుండా యధావిధిగా ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల ద్వారా లేదా వ్యవసాయ శాఖ ద్వారా రైతులకు నేరుగా యూరియాను పంపిణీ చేయ్యాలని కొత్తకోట మండల తహశీల్దార్ కు ఉమ్మడి పాలమూరు జిల్లా సిడిసి మాజీ చైర్మన్ భీసం చేన్నకేశవరెడ్డి వినతి పత్రం అందజేశారు.తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం రైతులకు యాప్ ద్వారా పంపిణీ చేయుచున్న యూరియ రైతుల పాలిట శాపంగా మారిందని రైతులు మొబైల్ ఫోన్ లో 'ఫర్టిలైజర్స్ యాప్' ద్వారా బుకింగ్ చేసుకుంటేనే యూరియా పంపిణీ జరుగుతుందన్నారు. అందుకోసం రైతులందరికీ తప్పనిసరిగా స్మార్ట్ ఫోన్ ఉండాలి. గ్రామీణ ప్రాంతాల్లో ప్రతి రైతుకు ఇట్టి స్మార్ట్ ఫోన్లను అందుబాటులోకి తెనాలి.ప్రస్తుతం గ్రామీణ ప్రాంతాల్లో ఇప్పటికీ 90% మంది రైతులకు స్మార్ట్ ఫోన్లు లేవు. స్మార్ట్ ఫోన్లు లేనప్పుడు యూరియాను,ఆన్లైన్ లో బుకింగ్ చేసుకోవడం అనేది కుదరదు.అదే విధంగా గ్రామీణ ప్రాంతాల్లో ఇంటర్ నెట్ సేవాలు కూడా సమయానికి సరిగ్గా అందుబాటులో ఉండవు. కేవలం కొన్ని ఇంటర్నెట్ కంపెనీల ద్వారా మాత్రమే అదికూడా అక్కడక్కడ మాత్రమే ఇంటర్నెట్ వస్తుంది. తహసిల్దార్ రైతుల కష్టాలను దృష్టిలో ఉంచుకుని ఇట్టి యూరియా విక్రయాన్ని శీఅశ్రీఱఅవ ఖజూజూ ద్వారా కాకుండా ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల ద్వారా మరియు వ్యవసాయ శాఖ ద్వారా అయిన రైతులకు నిర్ధిష్ట సమయానికి యూరియా సరఫరా చేయ్యాలని కొత్తకోట మండల తహశీల్దార్ కార్యాలయంలో తహశీల్దార్ ఆఫిస్ సీనియర్ అసిస్టెంట్ సరళమ్మ కి వినతి పత్రం అందజేసి కోరారు.ఇట్టి కార్యక్రమంలో చేన్నకేశవరెడ్డి తో పాటు మధనపురం మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ యాదగిరి గారు, బిఆర్ఎస్ పార్టీ నాయకులు మహేష్, వికాస్, మన్యం , గోపాల్, శివశంకర్ తదితరులు పాల్గొన్నారు.



## సైబరాబాద్ పోలీస్ డ్యూటీ మీట్‌లో
# సత్తా చాటిన కానిస్టేబుల్ అశోక్

సీపీ, డీసీపీ చేతుల మీదుగా పురస్కారం

కూకట్ పల్లి, మార్చి 17 (ప్రభాత ఉదయం)

ఇటీవల నిర్వహించిన సైబరాబాద్ పోలీస్ డ్యూటీ మీట్లో బాలానగర్ పోలీస్ స్టేషన్‌కు చెందిన కానిస్టేబుల్ అశోక్ అద్భుత ప్రతిభ కనబరిచారు. వివిధ విభాగాల్లో తన నైపుణ్యాన్ని చాటుకుని తృతీయ స్థానాన్ని కైవసం చేసుకున్నారు. మంగళవారం సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సీపీ డా. రమేష్ రెడ్డి, కానిస్టేబుల్ అశోక్‌ను ప్రత్యేకంగా అభినందించారు. ఆయన ప్రతిభను కొనియాడుతూ నగదు పురస్కారాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో క్రైమ్ డీసీపీ ముత్యం రెడ్డి, సీటీసీ ఏసీపీ గంగారాం తదితరులు పాల్గొన్నారు. అనంతరం బాలానగర్ సీఐ నర్సింహా రాజుతో కలిసి కానిస్టేబుల్ అశోక్, బాలానగర్ జోన్ డీసీపీ రితి రాజ్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా డీసీపీ నగదు పురస్కారం అందించి కీలక సూచనలు చేశారు. పోలీసులు ఎప్పటికప్పుడు మారుతున్న కాలానికి అనుగుణంగా తమ వృత్తి నైపుణ్యాలను మెరుగుపరుచుకోవాలి. విధి నిర్వహణలో క్రమశిక్షణ, అంకితభావంతో పనిచేసినప్పుడే ఉత్తమ ఫలితాలు వస్తాయి. నేర పరిశోధనలో ప్రతిభ చూపిన వారిని గుర్తించి గౌరవించడం వల్ల, తోటి సిబ్బందిలో కూడా ఉత్సాహం పెరుగుతుందని డిసిపి అభిప్రాయపడ్డారు.

# రోడ్డు ప్రమాదంలో విశ్వబ్రహ్మణ మండల అధ్యక్షుడు మృతి

గద్వాల, మార్చి 17(ప్రభాత ఉదయం)



గద్వాల పట్టణం రాజీవ్ మార్గ్ లో మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో కేటిదొడ్డి మండలం విశ్వబ్రహ్మణ మండలాధ్యక్షుడు, గంగన్ పల్లి వాసి, ఎంవీఎఫ్ మాజీ సమన్వయకర్త సదానందం చారి(44) మృతి చెందారు. మంగళవారం సాయంత్రం సదానందం రాజీవ్ మార్గ్ లో బైక్ పై వెళ్తున్న క్రమంలో ఫ్లై ఓవర్ నుంచి పాతబస్టాండ్ వైపు వెళ్తున్న ఆటో ఢీ కొట్టింది. దీంతో బైక్ పై వెళ్తున్న సదానందం డివైడర్ ఢీకొట్టి తీవ్రగాయాలు కాగ సంఘటన స్థలంలోనే మృతి చెందాడు. మృతదేహాని గద్వాల ఆసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. మృతునికి భార్య, పిల్లలు ఉన్నారు.దీంతో గ్రామంలో విషాదచాయలు అలుముకున్నాయి.బాలల హక్కుల కోసం నిరంతరం శ్రమించిన ఎంవిఎఫ్ కార్యకర్త, ఎంవిఎఫ్ మండల కోఆర్డినేటర్ అయిన సదానందం విద్యార్థుల పక్షాన నిలబడి, ప్రతి బాలలు పాఠశాలకు వెళ్లేలా కృషి చేసిన గొప్ప వ్యక్తి అని మండల ప్రజలు పేర్కొన్నారు.సదానందం మృతి పట్ల కేటిదొడ్డి మాజీ ఎంపీపీ మనోరమ్మ, గంగన్ పల్లి సర్పంచ్ పైటాల నర్సింహులు, మండల నాయకులు, జిల్లా విశ్వబ్రహ్మణ సంఘం నాయకులు వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.



# పేద ముస్లిం కుటుంబాలకు రంజాన్ తోఫా పంపిణి

గద్వాల జిల్లా ప్రతినిధి, మార్చి 17(ప్రభాత ఉదయం)

ముస్లింల పవిత్ర పండగ రంజాన్ ను పురస్కరించుకుని గద్వాల పట్టణం నల్లకుంటలో బీజేపీ పార్టీ కాంటెస్టెడ్ కౌన్సిలర్ కుంటల మాధవి గుండప్ప ఆధ్వర్యంలో పేద ముస్లిం కుటుంబాలకు మంగళవారం రంజాన్ తోఫాను పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పవిత్ర రంజాన్ మాసంలో పాటించే ఉపవాస దీక్షలు ఎంతో భక్తి శ్రద్ధలతో పాటిస్తారని, అల్లా ఆశీస్సులు ఎల్లప్పుడూ అందరికీ ఉండాలని కోరారు. రంజాన్ మాసంలో మత సామరస్యానికి ప్రతీక, మత సామరస్య భావం పెంపొంది ప్రజల మధ్య ఐక్యత పెరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో అడ్వకేట్ వినోదాచారి, సూపర్ వైసర్ శ్రీలత, వరలక్ష్మి టీచర్ , బీజేపీ నాయకులు లత్తి పురం రాంరెడ్డి మాణిక్యమ్మ, ముస్లిం సోదరి మణులు పాల్గొన్నారు.



# శ్రీరామనవమికి ఆలయానికి వచ్చే భక్తులకు అసౌకర్యం కలవకుండా చర్యలు తీసుకోవాలి

కూకట్ పల్లి రామాలయంలో అన్ని విభాగాల అధికారులతో సమీక్ష సమావేశం

కూకట్ పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు

కూకట్ పల్లి, మార్చి 17 (ప్రభాత ఉదయం)

వచ్చే శ్రీరామనవమికి ఆలయానికి వచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా చర్యలు చేపట్టాలని కూకట్ పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు సంబంధిత అధికారులకు సూచించారు. మంగళవారం కూకట్ పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు ఆధ్వర్యంలో కూకట్ పల్లి రామాలయంలో రాబోయే శ్రీరామనవమికి సంబంధించి ఏర్పాట్లపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అన్ని విభాగాల అధికారులతో ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు మాట్లాడుతూ వచ్చే భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా జిహెచ్ఎంసి, వాటర్ వర్క్స్, ఎలక్ట్రికల్ శాంతిభద్రతలు అధికారులు పరస్పరం కోఆర్డినేషన్ చేసుకుని ఎక్కడ ఎటువంటి ఇబ్బంది కలగకుండా చర్యలు తీసుకోవాలని అన్నారు. రాబోయే భక్తులకు మంచినీరు సౌకర్యం, ట్రాఫిక్ ఇబ్బంది లేకుండా చూడాలని అలాగే శాంతిభద్రతల విషయంలో అనుక్షణం కూడా ఎక్కడా ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. భక్తులు కూడా అధికారులకు సహకరిస్తూ వారు సూచించిన మార్గంలో వెళ్లాలని కోరారు. దీనికి అనుగుణంగానే ఆలయ ప్రాంగణంలో చలువ పందిళ్లు నిర్మించాలని, అన్నదానం దగ్గర ఎటువంటి ఇబ్బంది జరగకుండా స్టాల్స్ ఎక్కువ ఏర్పాట్లు చేయాలని, సమీక్షలో ఆలయ అధికారులకు సూచించడం జరిగింది. ఈ కార్యక్రమంలో జిహెచ్ఎంసి, వాటర్ వర్క్స్, ఎలక్ట్రికల్, శాంతిభద్రతలు, ట్రాఫిక్, మొదలగు అన్ని విభాగాల అధికారులు, మాజీ కార్పొరేటర్లు జూపల్లి సత్యనారాయణ, మాధవరం రోజా దేవి రంగారావు, మాజీ చైర్మన్ తులసిరావు, సూర్యారావు, ఆనందరావు, అశోక్, శ్రీనివాస్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



# ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ప్రజా ప్రభుత్వం పనిచేస్తుంది

టిపిసిసి ఉపాధ్యక్షుడు, కూకట్ పల్లి కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ బండి రమేష్

కూకట్ పల్లి, మార్చి 17 (ప్రభాత ఉదయం)

ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా సీఎం రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలోని తెలంగాణ రాష్ట్ర ప్రజా ప్రభుత్వం పనిచేస్తుందని టిపిసిసి ఉపాధ్యక్షుడు, కూకట్ పల్లి కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ బండి రమేష్ పేర్కొన్నారు. ఆయన మంగళవారం స్థానిక నాయకులతో కలిసి ఇంద్రానగర్ లో పాదయాత్ర నిర్వహించారు .ఇటీవల ముఖ్యమంత్రి కూకట్ పల్లి వచ్చిన సందర్భంలో ఇక్కడ సమస్యలపై స్థానికులు ఆయన దృష్టికి తీసుకెళ్లగా ఆయన ఆదేశాల మేరకు రమేష్ బస్తీలో పాదయాత్ర చేపట్టారు. ఇక్కడ డ్రైనేజీ లైన్, త్రాగునీరు, రహదారులు ప్రధాన సమస్యలుగా ఉన్నాయి. కొత్తగా విద్యుత్ మీటర్లు ఇవ్వడం లేదని స్థానికులు రమేష్ కి విన్నవించారు. డ్రైనేజీ పైప్లైన్ కోసం గతంలోనే అనుమతులు లభించాయని అయితే ఈ పనులను మధ్యలో ఆపివేయడం జరిగిందని వివరించారు. దీనిపై ఆయన స్పందిస్తూ అనుమతులు ఉన్నంతవరకు పనులను వెంటనే పూర్తి చేయాలని రమేష్ అధికారులకు సూచించారు. కాగా ఈబస్తీ తో పాటు ఐడిపిఎల్ కు చెందిన స్థలాన్ని కొంతమంది వ్యక్తులు కబ్జా చేసి అమ్మి సొమ్ము చేసుకున్నారని స్థానికులు రమేష్ దృష్టికి తీసుకువచ్చారు. దీనిపై ఆయన స్పందిస్తూ ఐపిఎల్ భూములు కబ్జాపై ప్రభుత్వం ఇప్పటికే విచారణ చేపట్టిందన్నారు. విచారణ పూర్తయి నివేదిక రాగానే కబ్జాలో ఎవరున్నా ఎంతటి వారైనా పార్టీలకతీతంగా కబ్జాదారులపై తగు చర్యలు తీసుకోవడం జరుగుతుందని కబ్జా స్థలాన్ని తిరిగి ప్రభుత్వం స్వాధీనం చేసుకుంటుందని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మధు గౌడ్ ,సోను ,పులి శివ గౌడ్, మధు, నరేందర్, తిరుపతయ్య, సత్యం, శంకర్ గౌడ్, ఏ రాజు, బి రాజు తదితరులు పాల్గొన్నారు.



# ప్రస్తుత అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలలోనే ఆశా వర్కర్ల సమస్యలు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలి

ఆశా వర్కర్లకు ఫిక్స్ డ్ వేతనం నిర్ణయించాలి

గద్వాల జిల్లా ప్రతినిధి,మార్చి17(ప్రభాత ఉదయం)

ప్రస్తుత అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలలోనే ఆశా వర్కర్లకు రూ. 18000 ఫిక్స్డ్ వేతనం నిర్ణయించాలని సీఐటీయు జిల్లా అధ్యక్షులు ఉప్పేర్ నరసింహ డిమాండ్ చేశారు. రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు వంట వార్పు లో భాగంగా మంగళవారం పాత కలెక్టర్ కార్యాలయం నుండి ర్యాలీ నిర్వహించి, అక్కడే భోజనాలు చేసి,ధర్నా చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ప్రస్తుత అసెంబ్లీ సమావేశాలలోనే ఆశా వర్కర్లకు 18000 వేతనం ఖరారు చేస్తూ జీవో జారీ చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం ఏర్పడి రెండు సంవత్సరాల కావోస్తున్న ఆశాలకు ఉద్యోగ భద్రత కల్పించడం లేదని విమర్శించారు. ప్రభుత్వం ఇచ్చిన హామీని అమలు చేయమంటే నిర్లక్ష్యం ఎందుకని ప్రశ్నించారు.ఆశాలకు కేంద్ర ప్రభుత్వం పెంచిన రూ. 1500 పారితోషకాలను సైతం ప్రభుత్వం అమలు చేయడం లేదని విమర్శించారు.గత పోరాటాల సందర్భంగా ఆశా వర్కర్లకు 18 వేల వేతనం ఇవ్వాలని, ఇన్సూరెన్స్ సౌకర్యం 50 లక్షలు కల్పించాలని,మట్టి ఖర్చుల కింద 50000 ఇవ్వాలని ,అర్హులైన ఆశాలకు ాచీవీ లుగా పదోన్నతులు కల్పించాలని, పారితోషకాలు లేని పనులు చేయించరాదని, అదనపు పని భారాలు తగ్గించాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను అమలు చేయమని కోరితే నిరంకుశంగా వ్యవహరిస్తూ కార్మిక పోరాటాలను అణచివేస్తున్నదని విమర్శించారు.చివరికి ఆశా కార్యకర్తలకు చేసిన పనికి నెల నెల వేతనాలు సైతం ఇవ్వలేని దౌర్భాగ్య స్థితిలో ప్రభుత్వం ఉండడం బాధాకరమన్నారు.ఈ సందర్భంగా తెలంగాణ ఆశా వర్కర్స్ యూనియన్( సీఐటీయు అనుబంధం) జిల్లా అధ్యక్ష కార్యదర్శులు పద్మ, సునీత సమస్యల పరిష్కారం కోసం మార్చి 28న జరిగే చలో హైదరాబాద్ కార్యక్రమానికి జిల్లాలోని ఆశా కార్యకర్తలు అధిక సంఖ్యలో హాజరై జయప్రదం చేయాలని కోరారు. అనంతరం డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని కలెక్టర్ గారికి అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆశాలు పద్మ, నర్సింగమ్మ, కాంతమ్మ, చెన్నమ్మ, అబేదా,లక్ష్మి,సరస్వతి, శశికల నరసమ్మ మేరీ తదితరులు పాల్గొన్నారు.

# ప్రజా సమస్యలను పరిష్కరించడంలో ఎల్లప్పుడూ ముందుంటా

యువనేత దొడ్ల రామకృష్ణ గౌడ్

కూకట్ పల్లి, మార్చి 17 (ప్రభాత ఉదయం)



ప్రజా సమస్యలను పరిష్కరించడంలో ఎల్లప్పుడూ ముందుంటారని ఆల్విన్ కాలనీ డివిజన్ కాంగ్రెస్ పార్టీ యువనేత దొడ్ల రామకృష్ణ గౌడ్ అన్నారు. శేరిలింగంపల్లి నియోజకవర్గం, అల్విన్ కాలనీ డివిజన్ ఎన్.టి.ఆర్ నగర్ కాలనీలో రెండు వీధులలో డ్రైనేజీ లైన్ జామ్ అయ్యి సమస్యగా ఉందని కాలనీ ప్రజల సమాచారంతో, శేరిలింగంపల్లి శాసనసభ్యులు పీఏసీ చైర్మన్ అరేకపూడి గాంధీ, డివిజన్ మాజీ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్ ఆదేశాలమేరకు యువనేత దొడ్ల రామకృష్ణ గౌడ్ కాలనీలో పర్యటించి ఎయిర్ టెక్ యంత్రంతో, వాటర్ వర్క్స్ సిబ్బందితో డ్రైనేజీ లైన్ ను దగ్గరుండి క్లియర్ చేయించి సమస్యను పరిష్కరించారు. ఈ కార్యక్రమంలో మల్లేష్, ఖాజా, సూపర్వైజర్ శివ, తదితరులు పాల్గొన్నారు.

# కండ్లలో కారం కొట్టి హవాలా డబ్బు దోచుకున్న దుండగులు





**24 గంటల్లో చేదించిన పోలీసులు... వారి వద్ద నుండి రూ. 77.39 లక్షల నగదు స్వాధీనం**

**కూకట్ పల్లి, మార్చి 17 (ప్రభాత ఉదయం)**

కూకట్‌పల్లి పరిధిలో సంచలనం సృష్టించిన రూ. కోటి దోపిడీ కేసును పోలీసులు 24 గంటల్లోనే ఛేదించారు. ఈ కేసులో ప్రధాన సూత్రధారి సహా నలుగురిని అరెస్టు చేసి, వారి వద్ద నుంచి రూ. 77.39 లక్షల నగదు, 39,195 ఫ్లైట్ టికెట్ల స్వాధీనం చేసుకున్నట్లు కూకట్‌పల్లి జోన్ డీసీపీ రీతీరాజ్ వెల్లడించారు. బహదూర్‌పురాకు చెందిన ఖుర్సోద్దీన్ తన యజమాని పంపిన హవాలా నగదుపై కన్నేసి, తన స్నేహితుడు ఒమర్ షరీఫ్ గ్యాంగ్‌తో కలిసి దోపిడీకి స్కెచ్ వేశాడు. గత రాత్రి కూకట్‌పల్లిలో కోటి రూపాయల నగదు తీసుకుని వెళ్తుండగా, ముందస్తు పథకం ప్రకారం నిందితులు వెంబడించారు. పిల్లర్ నం. 836 వద్ద రాగానే ఖుర్సోద్దీన్, అజీముద్దీన్‌ల కళ్లలో మిరపపొడి చల్లి నగదు తో పరారయ్యారు. అదే సమయంలో కూకట్ పల్లి పోలీస్ స్టేషన్లో సిసిటిఎస్ఎస్ విభాగంలో కానిస్టేబుల్ గా విధులు నిర్వహిస్తున్న వ్యక్తి సిఐ సుబ్బారావుకు సమాచారం అందించారు. దీనితో ఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు నిందితులు వదిలేసిన హోండా యాక్టివా ఆధారంగా పోలీసులు దర్యాప్తు చేశారు. సీసీటీవీ ఫుటేజ్ ఆధారాలతో నిందితులు శంషాబాద్ విమానాశ్రయంలో ఉన్నట్లు గుర్తించి, వారు లక్నో పారిపోయేలోపే అదుపులోకి తీసుకున్నారు. అరెస్టయిన వారిలో ఒమర్ షరీఫ్, గౌస్ సద్దాం, హమీద్, ఖుర్సోద్దీన్ ఉన్నారు. పరారీలో ఉన్న మరో ఐదుగురి కోసం గాలిస్తున్నట్లు డీసీపీ తెలిపారు. ఈ కేసులో బాధితుడిగా ప్లాన్ ప్రకారం వ్యవహరించిన ఖుర్సోద్దీన్ నే ప్రధాన సూత్రధారిగా పోలీసులు గుర్తించారు. డబ్బుల కోసం ఆశపడి ఇంత తతంగాన్ని నడిపించాడని పోలీసులు తెలిపారు. ప్రస్తుతం నిందితులను అరెస్టు చేసి రిమాండ్ కు తరలించారు. 24 గంటల వ్యవధిలో కేసును చేదించిన కూకట్ పల్లి, సిసిఎస్ పోలీసులను అభినందించారు.

# ఘనంగా రేణుక ఎల్లమ్మ బోనాల జాతర

## ప్రత్యేక పూజలు నిర్వహించిన వివిధ పార్టీల నేతలు





**పటాన్ చెరు, మార్చి 17 (ప్రభాత ఉదయం):**

గడ్డపోతారం మున్సిపాలిటీ పరిధిలోని ఖాజీపల్లి గ్రామంలోని రేణుకా ఎల్లమ్మ దేవి బోనాల జాతర కళ్యాణ మహోత్సవంలో పటాన్ చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి,జిన్నారం మాజీ జెడ్పీటీసీకొలన్ బాల్ రెడ్డి, పటాన్చెరు బిఆర్ఎస్ ఇంచార్జ్ వెన్నవరం ఆదర్శరెడ్డి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు వి చంద్రారెడ్డి, అంతిరెడ్డి గారి అనిల్ కుమార్ రెడ్డి లు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.శ్రీ శ్రీ శ్రీ రేణుకా ఎల్లమ్మ దేవి జాతర కళ్యాణ మహోత్సవంలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ సందర్భంగా ఉదయం అభిషేకాలు,ప్రత్యేక పూజలు,అలంకరణలు, నిర్వహించగా,మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమం నిర్వహించి భక్తులకు ప్రసాదాలు పంపిణి చేశారు.ఈ కార్యక్రమం లో ఖాజీపల్లి మునిసిపల్ చైర్మన్ గద్దె సుష్మ గణేష్, మాజీ సర్పంచులు గద్దె నర్సింహా,ఆకుల నవీన్, సీనియర్ నాయకులు వెంకటేష్ గౌడ్,అమీన్పూర్ మాజీ చైర్మన్ పాండురంగారెడ్డి ,గండి కుమార్ యాదవ్,అర్కలా సురేష్, బొల్లారం మాజీ కౌన్సిలర్ బీరప్ప యాదవ్,మాజీ వార్డు మెంబర్ కృష్ణ యాదవ్, సింహాచలం అధిక సంఖ్యలో భక్తులు, తదితరులు పాల్గొన్నారు.





## విద్యార్థులకు సంస్కృతి, సంప్రదాయ అలవాట్ల అవగాహన కోసం

# ఫుడ్ ఫెస్టివల్ ఎంతగానో ఉపయోగపడుతుంది

## కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు చంద్రారెడ్డి

**పటాన్ చెరు, మార్చి 17 (ప్రభాత ఉదయం):**

ఆహారం ద్వారా సంస్కృతి, ఆరోగ్యం, సృజనను ప్రోత్సహించడమే లక్ష్యంగా, విద్యార్థుల సృజనాత్మకతను వెలికి తీయడంలో ఫుడ్ ఫెస్టివల్ ఎంతగానో ఉపయోగపడుతుందని కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు వి.చంద్రారెడ్డి, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు అంతిరెడ్డి గారి అనిల్ కుమార్ రెడ్డిలు అన్నారు. బొల్లారంలోని శ్రీ వాగ్దేవి పాఠశాలలో మంగళవారం ఘనంగా ఫుడ్ ఫెస్టివల్ కు వారు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు.ఈ సందర్భంగా చంద్రారెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు స్వయంగా వివిధ రకాల వంటకాలను తయారుచేసి ఆహార పదార్థాలను ప్రదర్శించించడం అభినందనీయం అన్నారు. పులి హోరా, బిర్యాని, పానీ పూరి, చాట్, స్వీట్స్, చల్లని పానీయాలు వంటి రుచికరమైన వంటకాలు సందర్శకులను విశేషంగా ఆకట్టు కున్నాయని అన్నారు, అంతిరెడ్డి గారి అనిల్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ శ్రీ వాగ్దేవి పాఠశాల ప్రతిష్టాత్మకంగా విద్యార్థులచే ఫుడ్ ఫెస్టివల్ నిర్వహించడం ద్వారా వివిధ ప్రాంతాల సంస్కృతి, సంప్రదాయ వంటలను తయారు చేసిన విధానం ప్రత్యేకంగా అభినందించదగ్గ విషయమని, ఆహార పదార్థాలు రుచితో పాటు వంటకాల ప్రదర్శన కూడా అందర్నీ ఎంతగానో ఆకట్టు కున్నాయన్నారు. ప్రత్యేకంగా విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఎంతో ఆకట్టుకున్నాయని చెప్పారు. శ్రీ వాగ్దేవి స్కూల్ నిర్వాహకులు అంబవరం ఉదయ్ భాస్కర్ రెడ్డి మాట్లాడుతూ విద్యార్థుల్లో స్వయం ప్రతిభ, బాధ్యత భావం, వ్యాపార దృక్పథం పెంపొందించడమే ఈ ఫెస్టివల్ ఉద్దేశం అని అన్నారు. ఈ కార్యక్రమంలో వాగ్దేవి స్కూల్ ప్రిన్సిపాల్, వివిధ పాఠశాలల నిర్వాహకులు,మాజీ కౌన్సిలర్లు, ప్రజాప్రతినిధులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.



## వ్యవసాయ శాఖ, ఆత్మ ఆధ్వర్యంలో

# రైతులకు శిక్షణ

**గద్వాల, మార్చి17(ప్రభాత ఉదయం)**

గద్వాల మండలం కొండపల్లి గ్రామంలో మంగళవారం వ్యవసాయ శాఖ, ఆత్మ ఆధ్వర్యంలో రైతు - శాస్త్రవేత్త చర్చ మరియు శిక్షణ కార్యక్రమము ( ఏటీఎం ఏ సౌజన్యంతో) నిర్వహించారు. ఈ కార్యక్రమములో తెలంగాణ రైత విజ్ఞాన కేంద్రం, మహబూబ్ నగర్ శాఖ డాక్టర్ అర్చన మేలైన పంటలు పత్తి, మిరప, కంది, మొక్కజొన్న తదితర పంటల పై వచ్చే తెగుళ్లు, చీడ పీడల గురించి, వాటి నివారణ గురించి రైతులతో చర్చించారు. పంటల పై రైతులకు ఉన్న సందేహాలను నివృత్తి పరచారు. ఆత్మ డిప్యూటీ ప్రాజెక్టు డైరెక్టర్ జగ్గునాయక్ ప్రకృతి వ్యవసాయం గురించి, పంటలపై ఇష్టానుసారంగా పురుగు మందులను రైతులు వాడుతున్నారని, దీని వల్ల కాన్సర్ వంటి రోగాలు వస్తున్నాయని, రైతులు పశువుల ఎరువు, పచ్చిరొట్ట ఎరువులు, వేప నూనెలను పంటలకు విరివిగా వాడాలని తెలిపారు. ఈ కార్యక్రమములో ఎడిఎ సంగీత లక్ష్మీ, గ్రామ సర్పంచ్ క్రిష్ణారెడ్డి, ఉప సర్పంచ్ లక్ష్మి నారాయణ, మండల వ్యవసాయాధికారి... ప్రతాప్ కుమార్, ఎఇఓ అనుషా, రైతులు తదితరులు పాల్గొన్నారు.

# రైతు భరోసాకు దరఖాస్తు చేసుకోవాలి

## కేటిదొడ్డి ఏవో రాజవర్ధన్ రెడ్డి

**గద్వాల జిల్లా ప్రతినిధి, మార్చి 17(ప్రభాత ఉదయం)**



ప్రభుత్వం రైతులకు పెట్టుబడి కింద ఆర్థిక సాయం అందించే 'రైతు భరోసా' పథకానికి దరఖాస్తు చేసుకోవాలని కేటిదొడ్డి మండల వ్యవసాయ అధికారి (ఏవో) రాజవర్ధన్ రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఫిబ్రవరి 28 వరకు కొత్తగా పట్టాదారు పాస్ పుస్తకాలు పొందిన రైతులు, ఇప్పటివరకు రైతు భరోసా పొందని, బ్యాంకు వివరాలు నమోదు చేయని వారు రైతు వేదికల వద్ద దరఖాస్తు చేసుకోవాలన్నారు. దరఖాస్తు పత్రంతోపాటు పట్టాదారు పాసు పుస్తకం, ఆధార్ కార్డు, బ్యాంకు ఖాతా పుస్తకం నకలు ప్రతులు, మొబైల్ నంబర్ వివరాలను సమర్పించాలన్నారు. దరఖాస్తుల సమర్పణకు మార్చి 25 వరకు గడువు ఉందని ఆయన పేర్కొన్నారు.




# ఉచిత వైద్య శిబిరాలు పేదలకు ఎంతో దోహదం: గుండ్ల మహేందర్ రెడ్డి

## మమతా హాస్పిటల్ సౌజన్యంతో వైద్య శిబిరం ఏర్పాటు

**పటాన్ చెరు, మార్చి 17 (ప్రభాత ఉదయం):**

అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని బొల్లారం డివిజన్ పరిధిలోని బాలాజీ నగర్ లో కాంగ్రెస్ సీనియర్ నేత గుండ్ల సుజాత మహేందర్ రెడ్డి ఆధ్వర్యంలో మమతా హాస్పిటల్ వారి సౌజన్యంతో ఉచిత వైద్య శిబిరం ఘనంగా నిర్వహించారు. మంగళవారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం మూడు గంటల వరకు ఈ ఉచిత శిబిర కార్యక్రమం నిర్వహించారు. ఈ శిబిరంలో జనరల్ మెడిసిన్ డాక్టర్ రాధిక, ఆప్తమాలజీ డాక్టర్ గాయత్రి ఆర్థోపెడిక్స్ డాక్టర్ మానస గైనకాలజీ, డాక్టర్ సంగీత న్యూరాలజీ వైద్య సేవలు అందించారు.అలాగే రోగులకు అవసరమైన పరీక్షలు, వైద్య సలహాలు, మందులు కూడా ఉచితంగా అందించారు. అవసరమైతే మెరుగైన చికిత్స కోసం ఆసుపత్రి రిఫర్ చేసే సదుపాయం కూడా ఉందన్నారు .ఈ కార్యక్రమానికి స్థానిక ప్రజలు పెద్ద ఎత్తున హాజరై వైద్య సేవలు వినియోగించుకున్నారు.ఈ కార్యక్రమంలో మమతా హాస్పిటల్ క్యాంపు మేనేజర్ ఆంజనేయులు గౌడ్, మమతా హాస్పిటల్ మానస రెడ్డి,మీడియా ప్రతినిధులు కృష్ణ,రవీందర్ రెడ్డి,హాస్పిటల్ వైద్య సిబ్బంది, స్థానికులు తదితరులు పాల్గొన్నారు.



Printed and Published **MEKALA DAMODAR REDDY** on behalf of DBC Publications, and Printed at Vanitha Graphics, H.No. 3-3-76/123/21, Maruthi Enclave, Attapur, Rajendra Nagar, Ranga Reddy, Telangana-500048. and Published at: H.No. 6-2-4/2, 1st Floor, Shivarampally , NPA, Rajendra Nagar, Ranga Reddy Telangana-500052. **Editor: MEKALA DAMODAR REDDY. "RNI. Title- Code: TELTEL12231**. Cell:9391089608